క్లుప్తంగా

27న పోష్ యాక్టుపై అవగాహన

సిద్దవటం : సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఈనెల 27న ఉదయం 11 గంటలకు పోష్ యాక్టుపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కల్యాణ్ తెలిపారు. సిద్దవటం కోర్టులో ఆయన బుధవారం మాట్లాడుతూ మహిళలకు వారు పనిచేసే ప్రదేశాల్లో పురుషుల నుంచి, పురుష ఉన్నతాధికారుల నుంచి గాని వేధింపులకు గురికాకుండా మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం పోష్ యాక్టును ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ యాక్టును వేధింపులకు గురయ్యే మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోష్ యాక్టు అవగాహన కార్యక్రమానికి మహిళలు, మండల స్థాయిలోని అన్నీ శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

అభినందన



నియోజక వర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

వీరబల్లె (రాయచోటి టౌన్) : ఆడుదాం ఆంధ్రా పోటీలలో మండల స్థాయి నుంచి నియోజక వర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను ఎంపీడీఓ మల్లీశ్వరి అభినందించారు. వీరిని బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అభినందన సభను నిర్వహించి నియోజకవర్గ స్థాయిలో రాణించి జిల్లా స్థాయి, అలాగే రాష్ట్ర స్థాయిలోనూ రాణించి వీరబల్లె పటిష్టతను వ్యాపింపజేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపికైన వారిలో వాలీబాల్, క్రికెట్, షటిల్ క్రీడలకు చెందిన వారు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

చిన్నమండెం : ప్రజలు సైబర్ నేరాలపై చాలా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని చిన్నర్సుపల్లె కూడలి వద్ద బుధవారం సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఏర్పాటు



నూతన కమిటీతో నగిరిపాటి చెంగయ్య

పెనగలూరు (ఓబులవారిపల్లి) : ఎమ్మార్పీఎస్ పెనగలూరు మండల కమిటీని బుధవారం ఎంపిక చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నగిరిపాటి చెంగయ్య ఆధ్వర్యంలో మండల కమిటీని ఎంపిక చేశారు. జిల్లా కార్యదర్శిగా పసుపులేటి జయరామయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కుంచెం శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా పల్లాల కృష్ణయ్య, అధికార ప్రతినిధిగా పల్లాల రమణయ్య, కార్యదర్శిగా శ్రీనివాసులు ఎంపికయ్యారు. అలాగే మండల అధ్యక్షులుగా తలారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఏరాశి ప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా ఓబులు వెంకటసుబ్బయ్యలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పసుపులేటి శ్రీనివాసులు, నగిరిపాటి కిరణ్, టంగుటూరి సుబ్బనరసయ్య, దండు పెంచలయ్య, ఈటమాపురం నరసింహులు, ఏరాశి చంద్ర, మంద శివయ్య, సుబ్రమణ్యం, మంద సుధాకర్‌లు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు



ఎస్ఐ పెద్ద ఓబన్న

సిద్దవటం : మద్యం షాపులు తెరవక ముందే బెల్టు షాపుల ద్వారా అధిక రేట్లకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పెద్ద ఓబన్న హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచామన్నారు. మద్యం అమ్ముతూ పట్టుబడినట్లయితే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదని, కేసులు నమోదు చేస్తామని ఆయన అన్నారు.

పరామర్శ

నందలూరు(రాజంపేట) : మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గాల సుధాకర్ రెడ్డికి ఇటీవల కాలి ఆపరేషన్ జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డిలు బుధవారం ఆయన స్వగ్రామానికి వెళ్లి పరామర్శించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాటూరు సర్పంచ్ ప్రతినిధి మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

‘వైఎస్సార్ ఆసరా’తో పొదుపు సంఘాలకు బాసట

- ఇచ్చిన మాటను సంపూర్ణంగా అమలు చేసిన సీఎం వైఎస్ జగన్
- రామాపురంలో వైఎస్సార్ ఆసరా సదస్సులో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



వైఎస్సార్ ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు



రామాపురంలో భారీ సంఖ్యలో హాజరైన డ్వాక్రా మహిళలు

రామాపురం : వైఎస్సార్ ఆసరా పొదుపు సంఘాలకు బాసటగా నిలుస్తోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జరిగిన మండల వైఎస్సార్ ఆసరా నాల్గోవ విడత సదస్సు కార్యక్రమంలో మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీలను నెరవేర్చామన్నారు. ఎన్నికల సమయానికి డ్వాక్రా రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని చెప్పి నేడు సంపూర్ణంగా ఆ హామీని నిలబెట్టుకున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా రాయచోటి నియోజకవర్గంలో నాలుగు విడతల్లో రూ.108,97,16,863లు మాఫీ కాగా మండలంలో వైఎస్సార్ ఆసరా నాల్గోవ విడత కింద 479 సంఘాలకు రూ.3.26 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు.

జగన్ పాలనలో అర్హతే ఆధారంగా పథకాలు

సీఎం జగన్ పాలనలో అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాల లబ్ధి పొందడం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2.50 లక్షల కోట్ల నిధులను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రభుత్వం అందించిందన్నారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని అవి చేస్తాం, ఇవి చేస్తామని గొప్పలు చెబుతున్న పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు జగన్ తరహాలో ఈ మాదిరిగా సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో చెప్పుకునే విధంగా ఒక్క శాశ్వత అభివృద్ధి పథకం ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు.

దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి...

ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే జగన్ ప్రభుత్వంపై తోడేళ్లు, గుంట నక్కలు, దుష్టచతుష్టయలు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలే తిప్పి కొట్టాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కొనే దమ్ము టీడీపీకి లేక పొత్తుల కోసం పాకులాడుతున్నాయని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి చెరువును కృష్ణా జలాలతో నింపుతామని మరోమారు స్పష్టం చేశారు. అనంతరం వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత మెగా చెక్కును ప్రజాప్రతినిధులతో కలిసి అందజేశారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని ప్రాంతాల నుండి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు రవిశంకర్‌రెడ్డి, బాబు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన సేవలందించాలి



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : ప్రభుత్వ ఆస్పత్రిని అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం 9:15 గంటలకే ఆస్పత్రికి వెళ్లి తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ముందుగా ఆస్పత్రిలోని ఓపీ గదులు, ఫార్మసీ, ల్యాబ్, ఫిజియోథెరపీ, నర్సింగ్ స్టేషన్ విభాగాలను పరిశీలించారు. వైద్యం పొందుతున్న రోగులతో మమేకమై వారికి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. తరువాత హాజరు పట్టీను పరిశీలించి వైద్యాధికారులు సమయం పాటించాలని సూచించారు. అక్కడే ఉన్న వైద్యాధికారులతో మాట్లాడుతూ ప్రతి రోజు రోగులు ఎంతమంది వస్తున్నారని అడగగా 600 మందికి తగ్గకుండా వస్తున్నారని వైద్యులు చెప్పారు. ఓపీ వెయ్యి మందికి తగ్గకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చేరోగులకు అంకితభావంతో సేవలు అందించి మన్ననలు పొందాలన్నారు. సుఖప్రసవాల సంఖ్యను పెంచేలా వైద్యులు పని చేయాలన్నారు. ఏదైనా క్లిష్ట పరిస్థితి వస్తే తప్ప ఇతరా ప్రాంతాలకు రెఫర్ చేయరాదని సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్‌కు సూచించారు. అలాగే ఆస్పత్రి ఆవరణంలో శుభ్రతను పాటించాలన్నారు. అలాగే బెడ్లపై ప్రతి రోజు బెడ్ షీట్లు మార్చాలని చెప్పారు. నూతన భవనంలోకి అన్ని విభాగాలను మార్చాలన్నారు. ఆక్సిజన్ పైప్‌లైన్ ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఫర్నీచర్, మెడిసన్, నీటి సరఫరా తదితర విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బేపారి మహమ్మద్ ఖాన్, షబ్బీర్, ఆర్మీ శంకర్, వైద్యాధికారులు డాక్టర్ మహేశ్వర రాజు, డాక్టర్ రెడ్డి భాస్కర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మిప్రసాద్, డాక్టర్ కోటేశ్వరమ్మ, డాక్టర్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

రామాపురం : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని బుధవారం వైఎస్సార్ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మాట్లాడుతూ గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్య పెంచడానికి కృషి చేయాలని సూచించారు. సభ్యత్వ రుసుమును పెంచాలని చెప్పారు. స్థానికులు గ్రంథాలయాలకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఆయనతోపాటు గ్రంథాలయం అధికారి సూర్యనారాయణరెడ్డి ఉన్నారు.

పాత రుణాలు చెల్లించి కొత్త రుణాలను పొందండి



రైతుతో మాట్లాడుతున్న ఏజీఎం నారాయణరాజు

గాలివీడు : డీసీసీ బ్యాంక్ పరిధిలో రుణాలు పొందిన ఖాతాదారులు సకాలంలో పాత రుణాలను చెల్లించి కొత్త రుణాలను పొందాలని డీసీసీ బ్యాంక్ ఏజీఎం నారాయణ రాజు తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలలో బకాయిలు ఉన్న రైతుల వద్దకు వెళ్లి రుణాలను చెల్లించి తిరిగి కొత్త రుణాలను పొందాలని తెలియజేశారు. తక్కువ వడ్డీతో డీసీసీ బ్యాంక్ రుణాలను అందిస్తున్నామన్నారు. అర్హులైన రైతులందరూ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సకాలంలో రుణాలను చెల్లించకపోవడంతో మొండి బకాయిల కింది వచ్చి అధిక వడ్డీ భారంతో రైతుకే నష్టమని వివరించారు. రుణాలు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఆయనతోపాటు మేనేజర్ నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్య సాధనతోనే క్రీడల్లో రాణింపు



పాటూరులో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

- హోరాహోరీగా నియోజకవర్గస్థాయి ‘ఆడుదాం ఆంధ్రా’
- పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



రాజంపేట టౌన్: కబడ్డీ పోటీలో తలపడుతున్న దృశ్యం

రాజంపేట టౌన్ : క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం నియోజకవర్గ స్థాయి పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఆడుదాం ఆంధ్ర పోటీల వల్ల అనేక మంది క్రీడాకారులు తమ ప్రతిభను చాటగలిగారన్నారు. ఈ పోటీల వల్ల క్రీడాకారులకు తమలోని ప్రతిభపై ఒక అంచనాకు వచ్చి ఉంటుందని అందువల్ల క్రీడలకు దూరం కాకుండా నిత్యం సాధన చేయాలని సూచించారు. కాగా పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఎంపీడీఓ ఫణిరాజకుమారి, రాజంపేట, నందలూరు మండలాల విద్యాశాఖ అధికారులు సుబ్బరాయుడు, నాగయ్య, క్రీడాపోటీల ఆర్గనైజర్ ఎస్ షామీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయికి ఎంపికైన జట్లు ఇవే

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా వాలీబాల్ పురుషుల విభాగంలో సిద్దవటం జట్టు, మహిళల విభాగంలో రాజంపేట, కబడ్డీ పురుషుల విభాగంలో సుండుపల్లె, మహిళల విభాగంలో రాజంపేట, షటిల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో సుండుపల్లె, మహిళల విభాగంలో రాజంపేట జట్లు జిల్లాస్థాయికి ఎంపికయ్యాయి. క్రికెట్, ఖోఖోకు సంబంధించి ఫైనల్ పోటీలు గురువారం జరగనున్నాయి.

వరద బాధితుల గృహాలకు బోరు ఏర్పాటు

నందలూరు(రాజంపేట) : రాజంపేట మండలంలోని పులపుత్తూరు గ్రామానికి చెందిన అన్నమయ్య ప్రాజెక్టు వరద బాధితులకు పాటూరు గ్రామంలో ఒక్కొక్క కుటుంబానికి ఐదు సెంట్లు చొప్పున 47 కుటుంబాలకు స్థలం కేటాయించారు. ఇళ్ల నిర్మాణం కోసం నీటి కొరత ఉండటంతో బోరును ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి దృష్టికి బాధితులు సమస్యను తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి బోరును ఏర్పాటు చేశారు. బుధవారం పాటూరు గ్రామానికి వెళ్లి ఇళ్ల నిర్మాణాలను, బోరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, సర్పంచ్‌లు అక్కిరెడ్డి మోహన్ రెడ్డి, జంబు సూర్యనారాయణ, కో–ఆప్షన్ సభ్యులు కరీముల్లా ఖాన్, నాయకులు హిమగిరినాథ్ యాదవ్, శ్రీను, శివశంకర్ రాజు, బూసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, విజయుడు, ఆర్ముగం విశ్వనాథ్, ఇలియాస్, లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మందరం గంగిరెడ్డి, శివరామరాజు, ఉమామహేశ్వర్ రెడ్డి, చెర్లోపల్లి శివరాం రాజు, హర్షవర్ధన్ రెడ్డి, ఊటుకూరు రాజేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన నందలూరు క్రీడాకారులు



ఖోఖోలో విజేతగా నిలిచిన బాలికల జట్టు

నందలూరు(రాజంపేట) : రాజంపేట నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీలలో నందలూరు క్రీడాకారులు సత్తాను చాటారు. రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం జరిగిన బాలికల ఖోఖోలో మొదటి స్థానాన్ని, కబడ్డీ, వాలీబాల్‌లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బాలుర జట్టు ఖోఖోలో ఫైనల్ చేరగా, వాలీబాల్‌లో మూడో స్థానంలో నిలిచారు. మండలంలోని క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రాలో సత్తాను చాటి నందలూరు కీర్తి ప్రతిష్టలు పెంపొందించారని ఎంపీడీఓ సౌభాగ్యమ్మ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సతీష్ కుమార్, పీడీ కృష్ణయ్య, సుస్మిత, విశ్వనాథ్, పీఈటీ పవార్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

‘వైఎస్సార్ ఆసరా’ ఏర్పాట్ల పరిశీలన



కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె : వైఎస్సార్ ఆసరా కార్యక్రమం లక్కిరెడ్డిపల్లెలో గురువారం జరుగనుంది. మండల కేంద్రం పరిధి వేంపల్లె మార్గంలోని కోర్టు ఎదురుగా ఉన్న స్థలంలో సభ జరుగనుంది. ఆసరా పంపిణీ కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డిలు కోరారు. కాగా వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమ ఏర్పాటు నాయకులు పరిశీలించారు.

ఆటో ఢీ ; ఇద్దరికి గాయాలు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో బుధవారం ఆటో ఢీ కొనడంతో కె.సుబ్బలక్షుమ్మ, నాగయ్య దంపతులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు ఓబులవారిపల్లి నుంచి శివశంకరాపురం గ్రామానికి కూరగాయల బండిని దొబ్బుకుంటూ దంపతులు వెళ్తుండగా వాటర్ సప్లై ఆటో ఢీ కొంది. దీంతో కూరగాయల బండి పల్టీకొట్టగా, దంపతులకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

క్రీడలపై ఆసక్తి పెంచేందుకే ‘ఆడుదాం ఆంధ్ర’

– ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు అర్బన్: కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న ప్రభుత్వవిప్

రైల్వేకోడూరు : మన గ్రామాల్లోని క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి పరిచయం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. బుధవారం మండలంలోని కె.బుడుగుంటపల్లె పంచాయతీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఓబులవారిపల్లె, చిట్వేలి మండల జట్ల మధ్య జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాలలోని ఆణిముత్యాలను దేశానికి అందించడం జరుగుతుందని, ఈ క్రీడా సంబరాలు దేశ చరిత్రలోనే మైలు రాయి అని పేర్కొన్నారు. ఆరోగ్యం సరిగా ఉండాలంటే మన జీవితంలో క్రీడలు అవసరమని, క్రీడలతో అనారోగ్య సమస్యలు దూరమవుతాయని అభిప్రాయపడ్డారు. గ్రామ, వార్డు సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దేశంలో అతి పెద్ద మెగా టోర్నీగా ఆడుదాం ఆంధ్రాను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. క్రికెట్‌లో అత్యున్నత ప్రమాణాలు పెంచేందుకు చెన్నై సూపర్ కింగ్స్ ముందుకు వచ్చిందని తెలిపారు. మహిళలు, బాలికలకు క్రీడలపై ఆసక్తిని పెంపొందించడానికి ఆడుదాం ఆంధ్ర ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే క్రికెట్, వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో సర్పంచ్ దార్ల చంద్రశేఖర్, మండల లీగల్ సెల్ చైర్మన్ సురేష్‌బాబు, సీఐ మదుసూదన్ రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, పట్టణ అధ్యక్షులు సీహెచ్ రమేష్, ఎంపీడీఓ జాషువా, భరత్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే

రైల్వేకోడూరు మండలం అయ్యవారిపల్లె అరుంధతివాడకు చెందిన 450 మంది భక్తులుతో చేపడుతున్న పెంచలకోన పాదయాత్రను బుధవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రారంభించారు. అనంతరం వారికి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, మండల లీగల్ సెల్ చైర్మన్ ఆర్‌సీ సురేష్‌బాబు, భరత్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రాజు, సుబ్బయ్య, వెంకటేష్,, నరసింహులు, వేమయ్య, మల్లికార్జున, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని మాధవరం పోడు గ్రామానికి చెందిన ఏడుక వెంకటేష్ గత మూడు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చెన్నై విజయ ఆసుపత్రిలో చికిత్స పొందగా జీవనోపాధి కోల్పోవడంతో ఆ కుటుంబానికి అండగా ఉంటూ కుటుంబ సభ్యులకు బుధవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఆదుకుంటుందన్నారు. కార్యకర్తలే పార్టీకి బలమని, సీఎం జగన్‌ని ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరికీ అండగా ఉంటామని తెలియజేశారు.

మాజీ ఎంపీటీసీకి నివాళి

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లె మాజీ ఎంపీటీసీ ముక్కా ప్రతాప్ రెడ్డికి ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల ముక్కా ప్రతాప్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలలో ఆయన చురుగ్గా పాల్గొనేవారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు.అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ నాయకులు అక్కిరెడ్డి మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు ముక్కా వెంకటసుబ్బారెడ్డి, ముక్కా నారాయణ రెడ్డి, డీఆర్‌సీసీయూ మెంబర్ భరత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలను ఎదగనిద్దాం.. చదవనిద్దాం

- ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం
- మహిళా చట్టాలపై అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు



సంబేపల్లె: కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు



చిట్వేలిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చిట్వేలి : ఆడబిడ్డలను స్వేచ్ఛగా ఎదగనిద్దాం, చదవనిద్దాం అప్పుడే అద్భుతాలు సృష్టిస్తారని ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు సీడీపీఓ రాజేశ్వరి పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవంలో భాగంగా బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం, ర్యాలీ, ప్రతిజ్ఞ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రాజేశ్వరి మాట్లాడుతూ బాలికలలో జరుగుతున్న అసమానతలపై అవగాహన కల్పించేందుకు విద్య, ఆరోగ్య, పోషకాహారం వంటి విషయాలలో బాలికలకు బాలురతో సమానంగా అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. లింగ వివక్ష, బాల్య వివాహాల నిషేధిత చట్టం – 2006ను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ మొదటి ప్రధాని అయిన జనవరి 24ను జాతీయ బాలికా దినోత్సవంగా 2008 నుంచి ఆనవాయితీగా జరుపుకుంటున్నామని వివరించారు. అనంతరం బేటీ బచావో, బేటీ పడావో ప్రతిజ్ఞను చేయించారు. అలాగే ఉన్నత పాఠశాల నుంచి కొత్తబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు వసుందరమ్మ, విజయకుమారి, విశాలాక్షి, సురేఖరాణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

స్త్రీలు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి అర్బన్ : విద్య, ఉద్యోగ రంగాలలో ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను స్త్రీలు సద్వినియోగం చేసుకోవాలని రాయచోటి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.రేఖ అన్నారు. స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ బాలికాదినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో స్త్రీలకు సమాజంలో సమానత్వం, హక్కులు, విద్య, ఆరోగ్యం వంటి అంశాలలో ప్రభుత్వం అన్ని విధాల సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. మహిళలు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి దిశగా ముందడుగు వేయాలన్నారు. సాయి కళాశాల ఏడీ సుదాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణ, నిబద్ధతతో కూడిన అభ్యసించాలన్నారు. తద్వారా ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకుని, మహిళా సాధికారతను సాధించాలని తెలియజేశారు. అనంతరం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో ఏర్పాటు చేసిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బాలాజీతో పాటు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహం వద్దు.. చదువే ముద్దు

సంబేపల్లె : బాల్య వివాహం వద్దు.. చదివే ముద్దు అని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడారు. బాలికలందరూ బాగా కష్టపడి చదువుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. మహిళా ఉపాధ్యాయినులు మాట్లాడుతూ తరతరాలుగా స్త్రీలు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని, బాగా చదువుకోవడమే అన్ని సమస్యలకు పరిష్కారం అన్నారు. అలాగే అమ్మాయిల రక్షణకు ఉన్న వివిధ చట్టాలు గురించి అవగాహన కల్పించారు. సృష్టికి మూలం స్త్రీలే అన్నారు. వారిని గౌరవించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, రూప లక్ష్మీ, జ్యోతి, ఆదిలక్ష్మీలు మాట్లాడారు. అమ్మాయిలకు కౌమార దశలో వచ్చే మార్పులు గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, పాటించాల్సిన శుభ్రత గురించి మహిళా ఉపాధ్యాయినులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విద్యార్థినీలకు ప్రత్యేకంగా తెలియజేశారు.

ఆడబిడ్డలను ఆదరించండి

ఓబులవారిపల్లె : మగబిడ్డలతో సమానంగా ఆడబిడ్డలను ఆదరించాలని ఎంఈఓ – 2 రెడ్డయ్య పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ రెడ్డయ్య మాట్లాడుతూ ప్రభుత్వం బాలికల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఆడబిడ్డలను బాగా చదివించి ఉన్నత శిఖరాలు అధిరోహించేలా చదివించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె: మాట్లాడుతున్న ఎంఈఓ రెడ్డయ్య



రాయచోటి అర్బన్: బహుమతిని అందజేస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రేఖ